**మనిషికి అతి సన్నిహితంగా వుండేది మనసు. అయినా, ఎన్నటికీ పూర్తిగా అర్థంకానిదీ మనస్సే! తెలుపు, నలుపుల ఎత్తులు వేస్తూ మనసు ఆడుకునే నిత్య నిర్బంధ చదరంగంలో జీవితం పావుగా మనిషి నడుస్తూ....నడుస్తూ, ఓడుతూ....గెలుస్తూ....!**

చల్లగాలి రివ్వున వీస్తోంది.

ఎర్షపు జల్లు రిక్షాలోకంటా కొడుతోంది. పాంటు క్రింద భాగం అంతా తడిసిపోయి కాళ్ళకి అసహ్యంగా అంటుకుంటోంది. కొత్త "షూస్" తడిసిపోతున్నాయి. మనస్సు బాధతో మూలుగుతోంది.

రిక్షా గతుకుల్లోంచి పోతోంది. చుట్టూ చీకటి. ఉండుండి గాలి తీవ్రంగా వీస్తోంది. రిక్షావాడు రిక్షా తొక్కుతున్నాడో గాలికి ఎగిరిపోయాడో అని అనుమానం వచ్చింది అతనికి. అప్పుడప్పుడతనికలాటి విచిత్రమయిన అనుమానాలొస్తుంటాయి. రిక్షా గాలికే పోతోందేమోనని మరొకనుమానం. చీకటి ఏడుస్తున్నట్టుగా వుంది.

"బాబూ తవరేం జేస్తారు."

చీకట మాట్లాడుతున్నట్టుగా అనిపించింది.

చీకటి ప్రశ్నిస్తున్నట్టుగా వినిపించింది.

"చదువుకుంటున్నాను "

"ఏటి చదువుతున్నారు బాబూ."

కంఠంబట్టి మనిషిని ఊహించడానికి ప్రయత్నిస్తున్నాడు.

"డాక్టర్"

"ఏడబాబూ. ఈడనేనా?"

"కాదు విశాఖపట్నంలో"

"ఇసాకపట్నవా బాబూ ?"

"ఊఁ"

"అక్కడన్ని రేట్లూ శానా ఎక్కువ బాబూ.

అతను మాట్లాడలేదు

నల్లట ముఖం, బొద్దు మీసాలు, మాసిన గెడ్డం, నలుపుకి, ఎరుపుకి మధ్యరంగులో అట్టుకటిన తల మనిషిని వూహించడానికి ప్రయత్నిస్తున్నాడు.

కళ్ళు- కళ్ళెలా వుంటాయి ? మనిషి ముఖంలోని ప్రత్యేకతంతా కళ్ళల్లోనే వుంది. ఎర్రగా వుంటాయి. అనుమానం లేదు మత్తుగా వుంటాయా ? ఊహకు అందడంలేదు.

కళ్ళు కళ్ళు.. ఐ బ్యాంక్- అవును ఐ బ్యాంక్ - చచ్చిపోయేటప్పుడు కళ్ళు "ఐ బ్యాంక్" కివ్వాలి. ఏదో సినిమా గుర్తుకొస్తోంది ఏమిటది ? అనురాగ్ - కాదా అనురాగాలు - ఏదైనా ఒకటే.

చచ్చిపోయినప్పుడు కళ్ళు ఐ బ్యాంక్‌కిచ్చెయ్యాలి తన "కార్నియ" మరో అందమైన కళ్ళకి అందమైన ప్రపంచాన్ని చూపించాలి

హఠాత్తుగా తన మీద తనకే చిరాకు కల్గింది.

అందమైన వర్షాకాలం అందమైన తెల్లారగట్ల అందమైన కలలు కనడంపోయి చావుగురించి ఆలోచిస్తున్నాడు. చావు— అవును చావంటె అంత భయం ఎందుకు. తను వైద్యం చదువుతున్నాడు. కాని తనూ



మనిషే. వట్టి పిరికి మనిషి!

అమ్మమీద కోపం వచ్చింది. అమ్మ మీద ఎప్పుడూ కోపం వస్తూనే ఉంది— పుట్టినప్పటనించి ఇప్పటిదాకా. కాని ఏం అనలేదు. ఎందుకు ఏం అనలేదు. ఏదో సెంటిమెంటు పట్టి లాగుతోంది.

"రాజూ నువ్వు మండపాక పెళ్ళికి వెళ్ళాలి. ఎవరూ వెళ్ళకపోతే బాగుండదు." మొన్నరాత్రి చెప్పింది.

"వెళ్ళకపోతే ఏం పోయిందమ్మా?"

"అలాగనకు అక్క పెళ్ళికి వాళ్ళందరూ వచ్చేరు. మనం ఒక్కళ్ళం వెళ్ళకపోతే బాగుండదు"

"ఎవరికి బాగుండదు"


"నాకు. ఒరే మా తలలున్నంతవరకు ఈ రాకపోకలు మొహమాటాలు తప్పవు. మేం వెళ్ళిపోయిన తర్వాత మీరూమీరూ ఏం పడతారో మా కనవసరం."

తను మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు? అయినా పుట్టిన వూరు వెళ్ళడానికి అంత బద్ధకం ఏమిటి?"

పుటిన ఊరు—జన్మభూమి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి."

స్వర్గం. ఈ ముసలాళ్ళకెప్పుడూ స్వర్గం గురించే ఆలోచన. ప్రతివాడికీ కావాలి రంభా, ఊర్వశీ. మేనకా. పళ్ళీ సినిమాలు గుర్తుకొస్తున్నాయి. సినిమాలు జీవితంలో ఒక భాగం అయిపోయాయి.




సెంటిమెంట్లనించి దూరంగా వెళ్ళిపోవా లనుకుంటూ మరింత దగ్గరవుతున్నాడు ఎందుకో గుండెల్లో ఎక్కడో మూల ఏదో కదిలింది. తియ్యని భావన జన్మభూమి. చాలాకాలం తర్వాత దాదాపు పది సంవత్సరాల తర్వాత మళ్ళీ వెడుతున్నాడు.

"బాబూ నిద్దరోతున్నారా?" అడుగుతున్నాడు ముసిలాడో, కుర్రాడో తెలియని రిక్షావాడు.

"లేదు. ఏవిటి?"

"ఇసాకపట్నంలో తవరెక్కడుంటారు."

"మహారాణీ పేట."

"బాబూ నాకు తెల్కడుగుతాను ఇసాకపట్నంలో ఇక్కడికింటె పెద్ద డాట్టర్లుంటారుట నిజమేనా బాబూ?"

ఏం సమాధానం చెప్పాలో తెలియటం లేదు. చిక్కు ప్రశ్నలు. జవాబు చెప్పలేని ప్రశ్నలు బయోకెమిస్ట్రీ ఓరల్స్ గుర్తొచ్చాయి.

మా వెంకటేశం అలాగంటాడు బాబూ.

ఎవరీ వెంకటేశం? గురజాడ మధురవాణి, లొట్టిపిట్ట జ్ఞాపకం వస్తున్నాయి.

"ఏటంటారు బాబూ!"

"అక్కడ ఆసుపత్రి పెద్దదే" అమ్మయ్య ఏదో ఒకటి చెప్పేశాడు.

"కాని బాబూ మరే ఇసయం చూసినా మన కాకినాడే మంచిది బాబూ!"

రంగారావు గుర్తుకొచ్చాడు. "కాకినాడంత అంగమైన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ మొత్తంమీద లేదు, అంటాడతను

"కూపస్థ మండూకం" అంటాడు మరొకడు. మండూకం కరెక్టా? మండూక్యం కరెక్టా?

ఏవయినా ఇక్కడినించి వెళ్ళిపోవాలి. ఈ ఎగుడు దిగుడు రోడమీంచి ఈ ఇరుకు మురికి సందుల్లోంచి.... ఎక్కడికో దూరంగా మంచుకొండల మధ్యకి, నయాగరా జలపాతాల్లోకి.... స్విట్జెర్‌లెండ్‌కి వెళ్ళిపోవాలి, వెళ్ళిపోవాలి

రిక్షా ఆగిపోయింది. ఆలోచనలుకూడా ఆగిపోయాయి.

"ఏంటయ్యింది?"

"తెలీట్నేదు బాబూ."

"తవదగ్గర అగ్గిపెట్టుందా?"

"లేదు" తనదగ్గర అగ్గిపెట్టెలేదు. తను [illegible]ట్ కాలడు. సిగరెట్టు కూడా కాల్చడు ఎవడో అన్నాడు సిగరెట్లు కాల్చనివాళ్ళే




కొంపలు కాలుస్తారని.

"నా దగ్గరకూడా లేదు బాబూ."

సోషలిజం వచ్చింది.

"అసలేంటయ్యింది?"

"రిక్షా కదలట్లేదు బాబూ"

మరేవిటి చెయ్యాలి? ఈ వర్షంలో ఈ గాలిలో ఏం చెయ్యాలి? బస్‌స్టాండ్ ఇంకా ఎంతదూరం ఉంది?

"ఎంత దూరమూ అది ఎంత దూరమూ" సుశీల గొంతుక పాడుతోంది గుండెలోపల.

"ఎవాగిపుడు బస్సెళ్ళిపోతుందేమో"

హఠాత్తుగా అనుమానం వేసింది.

ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది వీడు కావాలని రిక్షా ఆపెయ్యలేదుకదా? చీకట్లో వీడేం చేస్తున్నాడో? జేబులోంచి చాకు తీస్తున్నాడేమో? బెదిరిస్తాడేమో?

చేతికి వాచీ, వేలికి ఉంగరం, జేబులో వంద రూపాయలు వున్నాయి. అవన్నీ ఇచ్చెయ్యమంటాడా?

బ్రీఫ్ కేస్ చుట్టూరా చేతులు బిగుసుకున్నాయి. వంట్లో ఏదో అయినట్టనిపించింది. వెన్నులోంచి చలి పుట్టడం అంటే ఇదేనేమో అనుకున్నాడు.

వాడు నవ్వుతున్నాడు. దొంగవెధవ అనుమానంలేదు. కావాలనే ఈ చీకట్లో రిక్షా ఆపేశాడు.

"దిగండి బాబూ, ఎంతసేపలా కూకుంటారు? దిగి నడవండి. స్టాండు దగ్గరే."

దిగమంటున్నాడు. నడవమంటున్నాడు. చేతిలో కత్తుండి ఉంటుంది దిగితే పీకట్టుకుంటాడేమో?

తను ఎదిరిస్తే. అవును తను ఎదిరిస్తే? ఆ భయంకరమైన చీకటిలో తన చావుకేక కల్సిపోతుంది. పోటుమీదపోటు మొత్తం ఆరుపోట్లు. ఎప్పుడో వుప్పుటేర్లో శవం దొరుకుతుంది. చాపలు కళ్ళు ముక్కు కొరికేస్తాయి. ఓ గాడ్! అలా జరగకూడదు.

ఛ. ఏవిటింత పిరికిగ ఆలోచిస్తున్నాడు. తను పిరికివాడుకాదు. తను యువకుడు. తను రాబోవుయుగం దూత. తను పావన నవజీవన బృందావన నిర్మాత.

"ఇక దిగరేటి బాబూ."

సూట్‌కేస్ హాండిల్ మీద చేతులు బిగుసుకున్నాయి. దేవుణ్ణి తలుచుకున్నాడు

తర్వాత జేమ్స్‌బాండ్. సీన్‌కానరీలను గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇద్దరూ ఒకటే. కాదు వేరు వేరు!

"తను తీర్చుకోలేని కోర్కెలన్నిటినీ కలిపి ముద్దచేసి జేమ్స్‌బాండ్ పాత్రను సృష్టించాడు ఫ్లెమింగ్" అంటుంది రాజేశ్వరి రాజేశ్వరి సైకాలజీ ఎమ్మే సెకండియర్.

ఆకాశం మెరిసింది రాజేశ్వరి నవ్వులా.

ఆకాశం ఉరిమింది. రాజేశ్వరి కోపంలా. ఎక్కడో పిడుగుపడ్డట్టయింది.

ఉరుము, మెరుపు—మెరుపు. ఉరుము.

ఉరుము. మెరుపు. ఏది ముందు? ఏది వెనక. ఏ ఉరుము ఏ మెరుపుకి సంబంధించినది.

ఆలోచిస్తున్నాడు. తడుస్తున్నాడు. ఆలోచనలలో తడుస్తున్నాడు. రిక్షావాడు ముందుకి రాలేదు పీక పట్టుకోలేదు.

"ఈ దారమ్మట తిన్నగ పొండి...."

చెపుతున్నాడు వాడు. వింటున్నాడు తను.

ముందుకి నడిచాడు. వణికాడు కాని భయంతో కాదు- చలితో. సిగ్గుపడ్డాడు.

అతని మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది. శరీరం కుంచించుకుపోయే అవకాశం లేకపోవడంవలన మామూలుగనే వుండిపోయింది

నడుస్తున్నాడు. బూటులోకి మట్టి దూరింది. సాక్సులోకి మట్టి దూరింది. తన కాళ్ళమీద తనకే అసహ్యంవేసింది.

ఐదు నిమిషాల క్రితం తన మనఃస్థితి తల్చుకుని సిగ్గుపడ్డాడు మళ్ళీ ఛీ! ఎంత అసహ్యంగా ఆలోచించాడు.

మనుషులంటే తనకెంత అపనమ్మకం. ఛీ ఇదేమిటి? తనలో ఏదో సైకలాజికల్ డిసార్డర్ ఉంది. ఎర్రచీర మేడమ్‌ని కన్సల్ట్ చెయ్యాలి.

వర్షం తగ్గింది. చీకటి నిశ్శబ్దాన్ని పట్టుకుని ఏడుస్తోంది.

* * *

ఏడవ తరగతి మూడవ క్లాసులో పాసయిన కుర్రాడిలా చిన్నగా నిట్టూర్చి ఆగింది సర్కార్ ఎక్స్‌ప్రెస్. అన్ని రైలు బళ్ళు లాగే అదికూడా సర్కారువారి బండి. సర్కారు జిల్లాల్లోంచి పోయేబండి.

రాజు రైలు దిగగానే "ఎంక్వయిరీస్" దగ్గరకెళ్ళి సింహాద్రీ ఎక్స్‌ప్రెస్ ఎంత లేటో కనుక్కున్నాడు. గంటలేటు అంటె ఇంకా రెండున్నర గంటలు వెయిట్ చెయ్యాలి.

వెయిటింగ్. జీవితంలో ప్రతి చోట వెయిటింగే. బాత్‌రూమ్‌ల దగ్గర, మెస్‌లో, హోటల్లో .. వెయిటింగ్. ప్రియబాంధవి కోసం సుదీర్ఘమైన వెయిటింగ్.

వెయిటింగ్ రూమ్‌వైపు నడిచాడు. అది ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమ్ కాని ఫస్ట్‌క్లాస్ ప్రయాణీకులెవరూ అందులో వెయిట్

స్టీల్ హౌస్ ఫోన్ : 74893
ఏలూరురోడ్ (కాంగ్రెస్ ఆఫీసు రోడ్ కార్నర్) విజయవాడ-2.

అధునాతనమైన స్టెయిన్‌లెస్ స్టీల్, బ్రాస్ & కాపర్ మొదలగు మెటల్స్‌లో పలు రకముల పాత్ర సామాన్లు ప్రెషర్ కుక్కర్లు, బాయిలర్లు, ప్రజంటేషన్ ఆర్టికల్స్ లభించును సులభ వాయిదాల పద్ధతులు కూడా కలవు. (విజయవాడ నివాసులకు మాత్రమే).

SUVARNA

చేయడానికి ఇష్టపడరు. అది ఎయిర్ కండిషన్డ్ కాదు. కనీసం ఉన్న ఫాన్ కూడా తిరగటలేదు. రాజు ముందు సంకోచించినా లోపలికి అడుగుపెట్టాడు. తనది థర్డ్‌క్లాస్ టికెట్ కాదు సెకండ్‌క్లాస్ టికెట్. రెండు క్లాసులూ ఒకటే.

లోపలికి ప్రవేశించిన తర్వాత రాజు అనుమానం తీరిపోయింది. అందులో ఉన్నవాళ్ళందరూ తనలాటి వాళ్ళే. ఫస్ట్ క్లాస్ వాళ్ళెక్కళ్ళో ఇద్దరో ఉన్నారంతే.

ఒక్క చదువులోతప్ప తను మరెక్కడా ఫస్ట్‌క్లాస్‌కాదు అదికూడా మెడికల్ కాలేజీ కొచ్చేవరకే. అప్పట్నించీ సెకండ్ క్లాసే.

ఉక్కబోస్తోంది. చొక్కాపై బొత్తం విప్పాడు. చుట్టూ పరికించి చూశాడు. ఎదురుగుండా కూర్చుని ఉంద ఒక సిక్కు కుటుంబం మొత్తం నలుగురు-వారిద్దరూ, వారికిద్దరూ. ఏదైనా కొత్త ఫుడ్ డ్రింక్ తయారు చేస్తే వీళ్ళతో ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఫిల్మ్ తియ్యాలి, అనుకున్నాడు. నలుగురి ముఖాలోను పరిపూర్ణారోగ్యం తొణికిసలాడుతోంది. దే ఆర్ నాట్ సిక్.

ఆవిడ చేతుల్లేని జాకెట్ వేసుకుంది. ఆవిడ నున్నటి భుజాలు చూసి రాజు గుటక వేశాడు ఛ తప్పు అనుకుని కళ్ళు తిప్పుకోబోయాడు. కాని కళ్ళక్కడే అంటుకుపోయాయి. ఆమె అంగగత్తె. ఆమెకి అందాన్ని ప్రదర్శించడం తెలుసు. నవ్వుతూ మొగుడుకుతో ఏదో చెబుతోంది. మూప్పై ఐదేళ్ళుంటాయేమో కాని ముప్పై ఏళ్ళదానిలా కనిపిస్తోంది.

ఆ పక్కనే కూర్చునివుంది. ఆఫీసరు గారి కుటుంబం. కొందర్ని చూడగానే ఈయనేవో పెద్ద ఆఫీసరు అనిపిస్తుంది. ఆయన భార్యమీదకి వంగి చెవులో ఏదో చెపుతున్నాడు. ఆ అమ్మాయి లిదప తమ అందమైన కళ్ళను నల్లటి ఇంగ్లీషక్షరాలకే అంకితం ఇచ్చారు. ఆ పుస్తకాలు ఏం అయి వుంటాయో ఊహించబోయాడు రాజు.

ఒకటి ఛేజ్, రెండవది హెరాల్డ్ రాబిన్స్ తన గెస్‌వర్క్ ఎప్పుడూ తప్పవదు. తన కున్న ఒకే ఒక్క కళ అది.

ఆ ఇద్దరమ్మాయిల్లో సినిమాలో ఒకే నటి వేసిన రెండు పాత్రల్లా వున్నారు. పెద్దమ్మాయి చీర కట్టుకుంది. తన ఎత్తైన గుండెల్ని పైటవెనక దాచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఆమె మెడలో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ వుంది వయసులో వున్న యువకుల మనసులు వేడెక్కించి పాడుచేసే ఆకర్షణ అది.

రాజు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

మనోవ్యభిచారం ప్రతి మానవుడికి సహజమా? ఎవరో అన్నారు "శరీరాలంత పవిత్రంగా మనస్సు లెలాగా వుంచుకోలేం" అని. ఎంత నిజం! ఎంత నిజం!!

అది వయస్సు తప్పో మనస్సు తప్పో కాని దేవాలయంలో దేవుడి ఎదుట కూడా చూపు దేవుడిమీంచి పక్కనున్న అమ్మాయిమీదకి పోతుంది.

సింగుగారి శ్రీమతి పైట జారిపోయింది. ఆవిడ సరిచేసుకుంటూ ఓ చూపిలా విసిరింది. రాజు దొరికిపోయాడు! తప్పు చేస్తూ అది తప్పా? కాదా? ఏమో! ఆవిడ తనకంటె చాలా పెద్దది-దాదాపు పదేళ్ళు.

ఫ్రాయిడ్ గుర్తుకి వచ్చాడు. ఫ్రాయిడ్ చదవాలి- చదవాలి.

రాజేశ్వరి అంటుంది. "ఫ్రాయిడ్ సిద్ధాంతాలు చాలావాటితో నేనేకీభవించను"

"ఫ్రాయిడ్ అంటే నాకిష్టం."

"నువ్వు ఫ్రాయిడ్ చదవలేదు కాబట్టి"

"అయివుండొచ్చు. ఈడిపస్ కాంప్లెక్స్ అంటే ఏమిటి?"

"ఏదో ఒకటి"

"కాదు చెప్పు."

"నీకు తెలుసు."

"తెలియదు."

"ఫ్రాయిడ్ చదువు."

"అంత ఓపిక ఉంటే "బెయిలీ అండ్ లే" చదివేవాణ్ణి".

"అదేం బుక్కు?"

"సర్జరీ".

"లే. అంటే ప్రేమ కథనుకున్నాను."

*

"దిసీజ్ సరళా మై కొలీగ్ అండ్ దిసీజ్ మిస్టర్ రాజు ఫైనల్ ఇయర్ మెడికో."

"నైస్ టు సీ యూ"

"నైస్ టు సీ యూ."

"హి వాంట్స్ టు నో ఎబౌట్ ఫ్రాయిడ్ అండ్ ఈడిపస్ కాంప్లెక్స్" రాజేశ్వరి చెబుతోంది. ఆమె అంతరాంతరాల్లో ఎక్కడో నవ్వుతోంది.

"క్వయిటింట్ రెస్టింగ్, ఐ విల్ టెల్ యూ."

ఆమె చెబుతోంది ఆమె పెదాలు అందంగా కదులుతున్నాయి.

"అసలు మీరు ఈడిపస్ కాంప్లెక్స్ గురించి ఎక్కడ చదివారు."

"హామ్లెట్ మీద ఏదో క్రిటిసిజమ్ చదివా. అందులో హామ్లెట్ ఈడిపస్ కాంప్లెక్స్‌తో బాధపడ్డాడని రాస్తాడు."

మపాసా- మామ్; మామ్- బుచ్చిబాబు; బుచ్చిబాబు- గోపీచంద్‌ల రచనల మధ్య నున్న సంబంధం ఏమిటి?

ఇద్దరు మనుషులు ఒకే విషయం గురించి ఒకే రకంగా ఆలోచించడానికి కారణం ఏమిటి? ఇద్దరి మనుషుల ఆలోచనల ఫ్రీక్వెన్సీలు కలిస్తే ఏమవుతుంది. సరళ నడగాలి ఎంత కష్టమైన విషయమైనా సరళ ఎంత సరళంగా చెబుతుంది. షి ఇజె స్వీట్ గాల్. అలా అంటే రాజేశ్వరి అంటుంది.


# కలలు-వాటి ఫలితాలు

కలలు ఎందుకు వస్తాయి? ఎప్పుడు వస్తాయి? ఏ కలకు ఫలితం ఉంటుంది? ఎలాంటి కలకు ఎలాంటి ఫలితం ఉంటుంది? అన్న విషయాన్ని గూర్చి ఆంగ్ల, సంస్కృత, తమిళ గ్రంథాల్ని పరిశోధించి, సమగ్రంగాను, విపులంగాను వివరిస్తూ వెలువడిన మొట్టమొదటి గ్రంథం.

ఇందులో పిల్లలకు, పెద్దలకు, స్త్రీలకు, పురుషులకు వచ్చే వేలాది కలలకు వివరంగా ఫలితాలు ఇవ్వబడ్డాయి. ఎలాంటి కల వచ్చినా ఇతరుల సహాయం లేకుండా తమంతట తామే ఈ పుస్తకం చదివి తమ కలల ఫలితాన్ని తెలుసుకోవచ్చు.

ఆర్ట్ పేపరుపై అందంగా ముద్రించబడిన త్రివర్ణ ముఖ చిత్రంగల జాకిట్ కవరుతో—

వెల : రు. 10-00 పోస్టేజి రు. 3-00

ప్రతులకు :

SREE ARUNA BOOK HOUSE

103, Narayana Mudali Street, MADRAS—600 001.



ప్రేమించుకునే హృదయాలు ఎప్పుడూ కలసి ఉండటంవల్ల వారి ప్రేమ క్రమేపీ పల్చబడిపోవచ్చు అప్పుడప్పుడు చిన్నచిన్న ఎడబాటులవల్ల హృదయాల మధ్య ప్రేమ గాఢంగా పెరుగుతుంది.

—థామస్ హేలీ

*    *    *

మనం సామాన్యంగా చెప్పుకునే సాహస కృత్యాలు, వివిధ చరిత్రలవారిలో అనీతి పనులు చికాకు కలిగించే వాతావరణంలో ఎక్కువగా కనబడతాయి.

—బైరన్

*    *    *

మనకు వచ్చే కష్టాలలో కూడా మంచి ఉపయోగముంటాయి విష సర్పం తలలో మణి ఉన్నట్టుగా వచ్చే కష్టాలలో కూడా కొంత మంచి జరుగుతుంది.

——షేక్స్‌పియర్

*    *    *

స్వంత గొప్ప ఏమీలేనివారు వారి పెద్దలను గురించి చెప్పుకొని గర్విస్తారు. అలాంటివారు భూమిలో బంగాళా దుంపలా అంధకారంలో వుంటారు.

—వోవర్‌బరీ

*    *    *

స్నేహితునిపై కోపం వచ్చినపుడు అది అతనితో చెబుతాం కాబట్టి కోపం పోతుంది విరోధిపై కోపం వచ్చినపుడు అలా చెప్పటం జరగదు కాబట్టి కోపం పెరిగిపోతూ ఉంటుంది.

—విలియం బ్లేక్

*    *    *

ధైర్యవంతుడు తన జీవితాన్ని గురించి భయపడడు. అనుకొన్నది ధైర్యంగా చేస్తాడు ఆ విధంగా ఉన్నది పోగొట్టుకోవటమో లేకలేనిది పొందటమో జరుగుతుంది.

—జేమ్స్ గ్రాహం

సేకరణ : జె. ఎస్. కె. వి. ప్రసాద్, పెదపాడు

"సరళకి పెళ్ళయి పోయింది"

"అయితే?"

"వాళ్ళాయన నీకంటే స్పోర్ట్స్‌గా వుంటాడు."

"డామిట్ డోంటాక్ రబ్బిష్."

షి ఆల్వేస్ టాక్స్ నాన్సెన్స్. అండ్ షి హేజ్ నో సెన్సెటాల్. కాని తనేం అనలేడు. కారణం ఆమె అందమా? ఆమెలో ఆకర్షణా లేక ఆమెతో స్నేహమా- వీడని చిక్కు. ఎంత ఆలోచించినా తెలియదు. ఆమె గురించి ఆలోచించకూడదనుకుంటూనే ఆలోచిస్తాడు.

ఎమ్మే సైకాలజీ చెయ్యాల్సింది. ఇప్పటికైనా చెయ్యొచ్చు. మెడిసన్ అయిపోయిన తర్వాత చెయ్యాలి

"ఎక్స్‌క్యూజ్‌మి" తలెత్తి చూశాడు.

"అతను" నిలబడి ఉన్నాడు. పొడుగ్గా, బలంగా సినిమాలో "విలన్" లాగున్నాడు. నల్లటి పాంటుమీద ఎర్రటి చొక్కా "ఇన్ షర్ట్" చేశాడు. రెండు రంగులూ తనకు నచ్చవు. ఇష్టమైన రంగులకీ మనస్తత్వానికీ ఏదో సంబంధం ఉందిట.

"ఎక్స్‌క్యూజ్‌మి" మళ్ళీ అన్నాడు. సావిత్రి గుర్తుకొస్తుంది. ఎవరు అలా అన్నా సూటయిన ముక్కుకి రెండు వైపులా వెడల్పాటి కళ్ళు. అస్తమాను చికాకుపడే ముఖం. ఆమె హావభావ ప్రకటన ఆమె అందాన్ని హరించివేస్తుంది- కనీసం దాచివేస్తుంది.

"ఒక్కసారిలా వస్తారా."

లేచాడు. అతని కూడా ఫ్లాట్‌ఫాం మీదకి వెళ్ళాడు. ఎవరతను?

"ఐయామ్ ప్రసాద్."

"ఐయామ్ రాజూ."

అతను చెయ్యి ముందుకి చాచాడు. తను అందుకున్నాడు.

"గ్లాడ్ టు సీ యూ"

"మీరు విశాఖపట్నం వెడుతున్నారా?"

"అవునండీ"

"నేనూ విశాఖపట్నం పోతున్నాను. అక్కడ ఎమ్మే సోషియాలజీ చేస్తున్నాను మాది అమలాపురం. ప్లాట్‌ఫాంమీద పెట్టె పెట్టి బయటకు వెళ్ళాను. మళ్ళీ వచ్చి చూస్తే పెట్టె లేదు? డబ్బు, టిక్కెట్టు అన్నీ పెట్టెలోనే వున్నాయి. ఇప్పుడు నా దగ్గర రెండు రూపాయిలున్నాయంతే."

అతను ఆగాడు. అర్థం అయింది. అతనికి డబ్బు కావాలి.

"మీరొక టెన్ రుపీస్ హెల్ప్‌చేస్తే హాస్టల్‌కి వెళ్ళగానే ఎమ్.ఓ చేస్తాను. లేకుంటే తీసుకొచ్చి ఇస్తా."

కాదనలేడు. చదువుకున్నవాడు. సంస్కారం వున్నవాడు. అందమైన బట్టలు వేసుకున్నవాడు ఆఫ్టాల్ పది రూపాయలు కావాలంటే కాదనలేడు. చెయ్యి జేబులోకి పోయింది.

"థాంక్యూ సోమచ్ మీ రెక్కడుంటున్నారు. మీ ఎడ్రసివ్వండి" అతను జేబులోంచి పెన్నూ, చిన్న డైరీ తీసిఇచ్చాడు. రాస్తోంటే చేతులు వణికాయి. నుదిటిమీంచి చెమట బిందువులు కారి కాగితం మీద పడాయి.

"థాంక్యూ వన్సెగెయిన్."

ఏం అనాలి? నవ్వాడో వెర్రినవ్వు.

"టిక్కెట్టు తెచ్చుకుని వస్తాను."

అతను వెళ్ళిపోయాడు. మత్తు దిగిపోయింది.

*    *    *

విశాఖపట్నం వచ్చిన తర్వాత రాజు చాలాకాలం "మని ఆర్డరు" కోసం ఎదురు చూశాడు రాలేదు డబ్బుకోసం కాదు తను మోసం చెయ్యబడలేదు అనే తృప్తికోసం.

మానవ జీవితంలో తృప్తిలేదు.

యూనివర్సిటీకి వెళ్ళి ఎంక్వయిరీ చేద్దామనుకున్నాడు. కాని మళ్ళీ సిగ్గుపడ్డాడు, చికాకుపడ్డాడు - తన మీద తనే.

రెండు నెలల తర్వాత డైరీలో పెద్దక్షరాలతో రాసుకున్నాడు "రాజు ఓడిపోయాడు" అని మూడుసార్లు. రాజేశ్వరితో మాత్రం చెప్పలేదా సంగతి.

*    *    *

"రైలింకా రాలేదేమిటి?" చికాకుగా అడిగింది రాధ.

రాజు ఆమె కళ్ళల్లోకి చూస్తూ నవ్వాడు.

"ఏవిటా నవ్వు?"

"ఇంకా డెబ్భైఐదు నిమిషాలకి కాని రాదు."

"రైలు బాగా రష్‌గా ఉంటుందా?"

ఆమె కంఠంలో ఆదుర్దా—

"ఉండొచ్చు" నవ్వాడు.

"ఎందుకిలా నవ్వుతారు?"

"ఈ రైల్లో రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్ లేదు"

"నాకు తెలుసు."

"ఈ రైల్లో ఫస్ట్ క్లాస్ లేదు."

"కానీ ఈ రైల్లో రాధాదేవిగారు ప్రయాణం చేస్తున్నారు.

"షటప్" రాధ నవ్వుతోంది.

"మనం కారెప్పుడు కొనుక్కుందాం?"

"ప్రాక్టీసు పెట్టిన తర్వాత."

"ప్రాక్టీసెప్పుడు పెడతారు?"

"కారు కొన్నతర్వాత."

రాధ మళ్ళీ నవ్వింది

రాజు గుండెల్లో ఏదో అయ్యింది. ఆ

కళ్ళు. ఆ ముక్కు. ఆ పెదాలు అవన్నీ తనవే. ఏదో సంతృప్తి. ఏదో సాధించాడు.

"ఏమిటలా చూస్తున్నారు. నాకు సిగ్గేస్తోంది."

పదులు, ఇరవైలు కళ్ళు తన కేసి ఈర్ష్యగా చూస్తుంటాయి తను రాధతో రోడ్డుమీద నడుస్తుంటే. ఒకప్పుడు తనూ అలాగే చూశాడు- ఈర్ష్యతో, ప్రశంసతో.

"ఏదేనా మాగజీన్ తీసుకురండి బోర్ కొడుతోంది."

బుక్ స్టాల్ వైపు నడిచాయి కాళ్ళు. కొనకూడదనుకుంటూనే కొన్నాడు "బ్లిట్జ్"

ఇందిరాగాంధి. మొరార్జీ- చరణ్ సింగ్- వాజ్ పాయ్ లలో ఎవరు గొప్ప?

అప్పుడు చూశాడు అతన్ని అతను కూడ చూశాడు రాజుని.

"హలో" అతనే పలకరించాడు.

"డుయూ రికగ్నైజ్ మీ?"

రాజు తల ఊపాడు - అటూ ఇటూ.

"అప్పుడు నాకు పది రూపాయిలిచ్చారు"

ఎలా మర్చిపోతాడు తన ఓటమిని?

"ముందు కొంతకాలం నెగ్లెక్ట్ చేశా. తర్వాత ఎమ్.ఓ చేద్దామంటే మీ ఎడ్రస్ కనిపించలేదు."

"ఐ ఫీల్ వెరీసారీ."

"ఇట్సాల్ రైట్"

"నన్నపార్థం చేసుకునుంటారు."

"లేదు. లేదు"

"ఏమిటలా చూస్తున్నారు."

"ఏంలేదు"

"కాని నా దగ్గర ఇప్పుడు కూడా డబ్బు లేదు. ఐదు రూపాయలే వుంది. క్షమించాలి. మీ ఎడ్రస్ ఇవ్వండి. వెళ్ళగానే పంపించేసాను-ఎక్స్క్యూజ్ మి"

"ఫర్వాలేదు"

అతను కాగితం పెన్ను ఇచ్చాడు.

బుర్ర ఆలోచిస్తోంది. చేతులు రాస్తున్నాయి.

"ఒకె. సీయూ ఎగైన్."

"సీయూ"

"ఏమిటలా వున్నారు?" బ్లిట్జ్ తీసుకుంటూ అడిగింది రాధ.

"ఏం లేదు" సోఫాలో వెనక్కి జారగిలబడాడు.

అతను నిజంగానే ఎడ్రసు పోవడం వల్ల డబ్బు పంపించలేదా? లేక అతని వృత్తే అంతేనా? లేక మళ్ళీ తనెప్పుడూ కలవడుకదా అనే ధైర్యంతో పంపించలేదా?

పోనీ ఈసారి కనిపించినప్పుడు గుర్తించనట్టుగా తప్పించుకుని వెళ్ళిపోవచ్చుకదా! ఎందుకు పలకరించడం? అతను నిజంగా హానెస్ట్ ఫెలోనేమో? లేకపోతే అలా నటిస్తున్నాడో. అన్నీ అనుమానాలే. ఛ ఇన్ని అనుమానాలు కూడదు.

ఇప్పుడతను డబ్బు పంపుతాడా లేదా? పంపచ్చు పంపకపోవచ్చు. పంపుతాడో లేదో మరో సస్పెన్స్ - భరించలేడు. అందుకే తన ఎడ్రస్ ఇవ్వలేదు. ఏదో తెలియని ఎడ్రస్ ఇచ్చాడు. థాంక్ గాడ్ ఒక తెలివైన పనిచేశాడు. అతని మని ఆర్డర్ కోసం తను నిరీక్షించక్కరలేదు.

అతను కాని డబ్బు పంపితే? ఎమ్. ఓ. తిరిగి వస్తుంది. పది రూపాయలేకదా! అప్పుడతని బుర్ర పాడవుతుంది. తన సైకాలజీ అర్థంకాదు. తన సైకాలజీ తనకే అర్థం కావటంలేదు. ఇంక అతనికేం అర్థం అవుతుంది.

ఇంతకీ అతని చేతుల్లో తను మోసపోయాడా లేదా?

నమ్మించి మోసం చెయ్యడం కంటె భయంకరమైన విషయం మరొకటిలేదు.

ఇంతకీ అసలు విషయం ఏమిటి? బుర్ర పాడయిపోతోంది. ఆలోచనల వరదకి ఆనకట్ట కట్టాలి.

"రాధా"

"ఊఁ"

"బ్లిట్జ్" ఇలా గివ్వు."

"ఏం బాబూ లాస్ట్ పేజీలో బొమ్మ చూద్దామనా."

ఎంత అనుమానం? తనకి కూడా ఎంత అపనమ్మకం? మళ్ళీ ఆలోచనలు ప్రారంభం.

"రాధా"

"ఏమిటలా వున్నారు?"

"మనస్సు బాగాలేదు"

"ఏం జరిగింది?"

"ఏం లేదు. ఏమేనా మాట్లాడు."

ఆమె జాలిగా చూసింది.

"ఏం మాట్లాడమంటారు?"

"ఏదో ఒకటి"

"మీకెప్పుడేనా చంద్రముఖి గురించి చెప్పానా?"

"లేదు."

ఆమె చెపుతోంది. అతను ఆమె కళ్ళలోకి అమాయకంగా చూస్తూ కూర్చున్నాడు.

---

గాథావళి:

## జ్ఞాని - అక్షరజ్ఞాని; సి. పి. నిర్వచనం

ఒక అమెరికన్ యుద్ధ విలేకరి రెండవ ప్రపంచ యుద్ధకాలంలో భారతదేశం సందర్శించాడు. అతడు కేరళ పర్యటిస్తున్నప్పుడు కొద్ది రోజులు ఆ సంస్థానపు ప్రధాని సర్ సి. పి. రామస్వామి అయ్యరు అతిధిగా వున్నాడు. బ్రిటిషు ఇండియాకన్నా ఒక సంస్థానంలో అక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉండటం ఆ విలేకరికి ఆశ్చర్యం కలిగించింది.




"మీ సంస్థానంలో అక్షరాస్యత ఇంత ఎక్కువగా ఉండటానికిగల కారణమేమిట"ని అతడు ప్రశ్నించాడు.

"విజ్ఞానులు, అక్షర జ్ఞానుల మధ్యగల తేడా నీకర్థమవుతుందా?" అని తిరిగి ప్రశ్నించాడు సర్ సి పి.

తెలియదని చెప్పాడా విలేకరి.

"నేనొక దృష్టాంతం చెపుతాను విను. మా అమ్మగారు వేదాలను కంఠతః చదువుతుంది. ఒక్క అక్షరమ్మూకైనా చదవడం, రాయడం తెలియదు నేను చెప్పేది నీ కర్థమైందా?"

కాలేదన్నాడతను.

"ఆమెను నేను సంపూర్ణ జ్ఞాని అని అంటాను. కాని లార్డు మెకాలే దానికి పూర్తిగా భిన్నమైన నిర్వచన మిచ్చాడ"ని సర్ సి. పి. చెప్పగా, ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానం ఎలా నాశనంచేసి వేసిందో తెలుసుకొని ఆ విలేకరి బాధపడిపోయాడు.

— జి. వెంకట రామారావు